క్లుప్తంగా

ఈటీసీ మెస్, స్టేషనరీ టెండర్లు రద్దు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మెస్ నిర్వాహణ కోసం, స్టేషనరీ సరఫరా కోసం పిలిచిన టెండర్లను రద్దు చేసినట్లు కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 9వ తేదీన ఈ మేరకు మెస్‌కు నలుగురు టెండర్లు వేశారు. గత నెల 18న వాటిని తెరవాల్సి ఉండగా వాయిదా వేశారు. దీంతో అప్పటి నిర్వాహకుడు కుక్కల అప్పారావు నిరసన వ్యక్తంచేసి కలెక్టర్, సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా పరిపాలన కారణాలతో ఆ టెండర్లను రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు.

రామకృష్ణ సేవలు ఎనలేనివి



రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న రైల్వే మేనేజరు తదితరులు

సామర్లకోట: స్థానిక ఆర్పీఎఫ్ ఎస్సై పి.రామకృష్ణ గుడివాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ రైల్వే ఉద్యోగులు రామకృష్ణను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రైల్వే ఆస్తుల పరిరక్షణలో, ప్రయాణికుల భద్రతలో ఆయన సేవలు ఎనలేనివని తెలిపారు. రామకృష్ణ దంపతులను స్టేషన్ మేనేజరు రమేష్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు తదితరులు సత్కరించి వీడ్కోలు పలికారు.

భారీ అన్న సమారాధన



వాకతిప్పలో అన్నసమారాధన నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప సాలివాస పద్మశాలి రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వాకతిప్ప గ్రామం నుంచే కాకుండా కొత్తపల్లి, కుతుకుడుమిల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల వల్ల మాధవపట్నం, వీకే రాయపురం, బోయనపూడి, మామిళ్లదొడ్డి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలన్నారు.

రాయితీ గడువు పొడిగింపు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని పన్నుల బకాయిలపై విధిస్తున్న 50 శాతం వడ్డీ రాయితీని ఈనెల 30 వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలం, కుళాయి బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా 2025- 26 ఆర్థిక సంవత్సరానికి పన్నులు ఈ నెల 30వ తేది లోపు అడ్వాన్సుగా చెల్లిస్తున్న వారికి 5 శాతం రాయితీ కల్పిస్తూ జీఓ ఇచ్చిందని తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

కొత్తపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 2 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మండల పౌర సరఫరాల అధికారి మమత తెలిపారు. మండలంలోని ఉప్పాడకు చెందిన చిత్రాడ బాబూరావు ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసుల సహకారంతో దాడి చేసి పట్టుకున్నారు. ఉప్పాడ గాంధీనగర్‌కు చెందిన దొరబాబు బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయిస్తుంటాడు. అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 2 టన్నుల బియ్యాన్ని, తూనిక యంత్రాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వెంకటేష్, వీఆర్వో సురేష్ ఉన్నారు.

సక్సెస్ మంత్ర @ సర్కార్ కళాశాల

- ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ బోధన
- ఇంటర్మీడియెట్ చదువుకు చక్కని వేదిక
- ఒకేషనల్ విద్యతో మంచి భవిష్యత్
- మానసిక వికాసానికి విశాలమైన క్రీడాస్థలం
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



విశాలమైన ఆట స్థలం



సామర్లకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

సామర్లకోట: జీవితంలో మొదటిమెట్టు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తదుపరి వేదిక ఇంటర్మీడియెట్. జీవితాన్ని ఎటు మలుపుతిప్పుకోవాలన్నా ఇదే కీలకం. జీవితంలో స్థిరపడడానికి ఎన్నో దారులు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ మేరకు దారి నిర్ణయించుకోవలసిన సమయమిది. ఇందుకోసం పెద్దమొత్తాల్లో ఫీజులు చెల్లించి, తల్లిదండ్రులను విడిచి ఎక్కడెక్కడికో వెళ్లి వారిపై బెంగపెట్టుకుని చదువుకు ఆటంకాలు కల్పించుకునే పని లేకుండా సమీపంలోని ప్రభుత్వ కళాశాలల్లోనే ఇష్టమైన కోర్సుల్లో చేరే అవకాశాలు ఉన్నాయి. 1972లో సుమారు 25 ఎకరాల విశాలమైన ఆట స్థలంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ కళాశాలలో చేరడానికి మక్కువ చూపుతున్నారు.

ఒకేషనల్ కోర్సులకు అవకాశం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్సు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళల) కోర్సులతో పాటు ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో ఉచితంగా విద్యాబోధన సాగుతుంది. ఇంటర్‌లో చేరడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల ఏడో తేదీ నుంచి దరఖాస్తులు ఇస్తున్నారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కళాశాలకు చేరాయి. అయితే ప్రథమ సంవత్సరం సిలబస్ మారే అవకాశం ఉండడంతో పుస్తకాలు రాలేదని అధ్యాపకులు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే అందిస్తుంది.

తల్లిదండ్రులలో మార్పు రావాలి



పిల్లల విద్యా విషయాల్లో తల్లిదండ్రుల ఆలోచనలలో మార్పు రావాలి. ఎక్కువ ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో చదివిస్తేనే నాణ్యమైన విద్య అందుతుందన్న అపోహ నుంచి వారు బయటపడాలి. చాలా వరకు ప్రైవేటు కళాశాలల్లో బట్టీ విధానం అమల్లో ఉంటోంది తప్ప. పాఠ్యాంశాన్ని మనసుకు అర్థమయ్యేలా.. విద్యార్థి ప్రమాణాలకు అనుగుణంగా ఏ విధంగా బోధన చేయాలో తెలిసిన శాస్త్రీయ విధానం కేవలం ప్రభుత్వ కళాశాలల్లోనే ఉంటుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న ఎన్నో వేలు, లక్షల మంది ఉన్న ఉద్యోగాలు, వృత్తి వ్యాపారాల్లో రాణిస్తున్నారన్న విషయాన్ని మరువకూడదు.

– పసల పద్మరాఘవరావు, పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామర్లకోట

మంచి సదుపాయాలతో కళాశాల



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచి సదుపాయాలు, ల్యాబ్‌లు ఉన్నాయి. 435 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాశారు. ఒకేషనల్ 139 మంది, జనరల్ 105 మంది ద్వితీయ సంవత్సరంలోనికి వచ్చారు. వారికి తరగతులు ప్రారంభించాం. కళాశాలకు విశాలమైన క్రీడా మైదానం ఉంది. డిజిటల్ తరగతుల ద్వారా విద్యాబోధన సాగుతోంది. ఎంసెట్, నీట్‌కు ఉచితంగా స్టడీ మెటీయల్ అందజేసి, శిక్షణ ఇస్తున్నాం. కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రు లీలా శ్రీదేవి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామర్లకోట

ఆధ్యాత్మిక చింతన అవసరం



సదస్సులో ప్రసంగిస్తున్న చంద్రపాల్

పెద్దాపురం: ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమని ప్రముఖ దైవజనుడు జె.చంద్రపాల్ అన్నారు. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో గురువారం పురుషుల సదస్సు నిర్వహించారు. దైవజనుడు వంకా జాన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సామాజిక సమస్యలపై నిత్యం ప్రార్థించాలన్నారు. అనంతరం పాస్టర్ సత్యానందం, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల వ్యవస్థాపకులు రాయవరపు వీరబాబు, ప్రముఖ పీఎంపీ వైద్యులు చిర్రావూరి గంగారావు (దత్తుడు) చేతుల మీదుగా శిక్షకులకు బహుమతులను అందజేశారు.

19న రన్ ఫర్ జీసస్



టీషర్ట్, క్యాప్స్ ఆవిష్కరిస్తున్న పురుషోత్తమదాస్

పెద్దాపురం: ఈ నెల 19వ తేదీన నిర్వహించే రన్ ఫర్ జీసస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని క్లాప్స్ అధ్యక్షుడు పురుషోత్తమ్ దాస్ లంక అన్నారు. స్థానిక మిరాకిల్ చర్చిలో గురువారం ఆయన రన్ ఫర్ జీసస్ టీషర్ట్, క్యాప్స్, జెండాలను ఆయన ఆవిష్కరించారు. సహాయ కో–ఆర్డినేటర్ సుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాస్ మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం ఆరు గంటలకు స్థానిక లూథరన్ హైస్కూల్ నుంచి ర్యాలీ ప్రారంభమౌతోందన్నారు.

జగన్ భద్రతలో ప్రభుత్వ వైఫల్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భద్రత విషయంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గురువారం ఆమె పిఠాపురంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఏ నేతకూ లేని ప్రజాదరణ ఒక్క జగన్‌కే ఉందన్నారు. ఆయన ఎక్కడకు వెళ్లినా వేలల్లో జనసందోహం తరలి వస్తుండడం చూస్తుంటే అధికార పార్టీ వాళ్లే ఆశ్చర్యపోతున్నారన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన భద్రత విషయంలో అనేక లోపాలు కనిపిస్తున్నాయన్నారు. హెలిప్యాడ్ల వద్ద జనాన్ని పోలీసులు నియంత్రించకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. కొందరు అధికార పార్టీ నేతలు అవగాహన లోపంతో మాట్లాడుతు ఆయన ప్రతిపక్ష నేత కాదని ఒక ఎమ్మెల్యే అంటు వ్యాఖ్యానించడం చూస్తుంటే రాజకీయాలలో వారికి అవగాహన లేదని అర్థమవుతుందన్నారు. ఆయన ఒక మాజీ ముఖ్యమంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి ఎమ్మెల్యే అంటు ఆయన స్థాయిని తగ్గించాలనుకోవడం వారి మూర్ఖత్వంగా అనిపిస్తోందన్నారు. ఎవరు ఆయన స్థాయిని తగ్గించాలని చూసినా జనం ఊరుకునే పరిస్థితి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రికి తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాజీ మంత్రికి ఇచ్చే భద్రత కూడా ఇవ్వక పోవడం ప్రభుత్వం నిర్లక్ష్యమే అవుతుందన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వైఎస్ జగన్‌కు భద్రత కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

భక్తి భావాలను అలవర్చుకోవాలి



వాకతిప్పలో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎంపీ గీత

కొత్తపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద గురువారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. సర్పంచి పాలని దొరబాబు, రావు చిన్నారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపి హరిబాబు, కుతుకుడుమిల్లి సర్పంచి కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణు, పిఠాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పిఠాపురం: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద హైవేపై వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనల గురించి వివరించారు. ప్రతి వాహన చోదకుడు దగ్గర ఉంచుకోవలసిన పత్రాలపై, అమలవుతున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అతి వేగంగా, మద్యం తాగి, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపి అనర్థాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు, పిఠాపురం ఎస్సైలు ఎస్.రామకృష్ణ, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై అవగాహన అవసరం



అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: రైతులు అపరాల సాగుపై అవగాహన పెంచుకోవాలని ఏడీఏ స్వామి అన్నారు. మండలంలోని గోర్స గ్రామంలో పొలం బడి, అపరాల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం విడుదల చేసిన రాయితీ అపరాల విత్తనాలు అందించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అపరాల సాగు చేయడం వలన ఎకారానికి రూ. 10 నుంచి 15 వేలు వరకూ అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన బియ్యానికి 134 దేశాల్లో మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. అధిక శాతం మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ జోగిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ
- ప్రజా సమస్యలపై సీపీఐ పాదయాత్ర



సామర్లకోటలో ప్రజా సమస్యలపై సీపీఐ ప్రచార జాతా

సామర్లకోట: ప్రజా సమస్యలపై సీపీఐ పట్టణ నాయకులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక విఘ్నేశ్వర థియేటర్ నుంచి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ప్రచార జాతా ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ ముఖ్య అతిథిగా పాల్గొని గ్యాస్ సిలెండర్ ధర రూ.50, పెట్రోలు, డీజిల్ రూ.రెండు పెంచడం దారుణమన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమి కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ. లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలి. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఫీజు భారాలు తగ్గించాలన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను బర్తీ చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనంతో పాటు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు కేశవరపు అప్పలరాజు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణ పనులు



చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద శిథిలమైన కల్వర్టును తొలగిస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక పాత సామర్లకోటలోని చంద్రశేఖరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న కల్వర్టు పనులు గురువారం ప్రారంభించారు. ఈ రోడ్డులో కల్వర్టు దిగిపోవడం వల్ల సుమారు 8 ఏళ్లుగా వర్షం వచ్చిన సమయంలో డ్రైనులో నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఆ ప్రాంతంలో కల్వర్టు సమీపంలో ఉన్న ఇళ్లలోనికి డ్రైనులోని మురుగునీరు పోతోంది. ఆ వార్డు కౌన్సిలర్ కాళ్ల శ్యామల అనేక పర్యాయాలు కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ పనులు ప్రారంభించక పోతే తన పదవికి రాజీనామా చేస్తామని ప్రకటించారు. కల్వర్టు ప్రాధాన్యాన్ని గుర్తించాలని కౌన్సిలర్లు జట్ల మోహన్, ఆవాల లక్ష్మీనారాయణ కౌన్సిల్ సమావేశాలల్లో అధికారులు, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఎట్టకేలకు కల్వర్టు పనులు ప్రారంభించారు. చంద్రశేఖర స్వామి ఆలయ రోడ్డులో ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం జరగడంతో కల్వర్టును ఎత్తుగా నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ డ్రైన్ల నుంచి నీరు కావమ్మ ఆలయం వద్ద ఉన్న ఏలేరు కాలువలోనికి పోతుంది. కల్వర్టు ఎత్తుగా నిర్మిస్తే మురుగునీటి సమస్య ఉండదని ఆ ప్రాంత ప్రజలు తెలియజేస్తున్నారు.

నూకాలమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు



యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు గురువారం పోటెత్తారు. కొత్త అమవాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక బందోబస్తు కల్పించారు. స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చిరంజీవి ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్వేయర్లు

పిఠాపురం: జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో గల సచివాలయాల సర్వేయర్లు పిఠాపురం మండలం కుమారపురం సచివాలయం వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



కుంకుమ పూజలకు స్వామి వారిని తీసుకువస్తున్న అర్చకులు

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో కుంకుమ పూజలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు మహిళలచే కుంకుమార్చనలు నిర్వహించగా పూజా సామగ్రిని ఆలయం తరపున ఉచితంగా అందజేసి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

24న 'సామూహిక రాయబారం'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటి వద్ద 24వ తేదీన చేపట్టనున్న సామూహిక రాయబార కార్యక్రమం కరపత్రాన్ని గురువారం పట్టణంలోని స్థానిక నందూరి ప్రసాద్ రావు భవన్ వద్ద ఆవిష్కరించారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కరణం విశ్వనాథం దీనిని ఆవిష్కరించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి పెండింగ్ క్లెయిమ్ విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని, పనుల కోసం వేచి ఉండే అడ్డాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 24వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటి దగ్గర చేపట్టబోయే రాయబార కార్యక్రమంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాన్ని ఆవిష్కరించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పప్పుల వీరబాబు, ఎం.సత్తిబాబు, ఎం.సూరిబాబు, జి.సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వీరబాబు

సామర్లకోట: పట్టణ లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా గున్నాబత్తుల వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సాయంత్రం స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో వర్కర్స్ యూనియన్ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా పైలా శ్రీనివాసు, ఉపాధ్యక్షుడిగా మేడిద సురేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా మరణాల సత్యనారాయణ, కోశాధికారిగా ధన్నిన వెంకటరమణ ఎన్నికయ్యారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొత్తపల్లి: సారా నిర్మూలనలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. మండలంలోని కొమరగిరి శివారు పంట పొలాల్లో సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. పంట పొలాల్లో నిల్వ ఉంచిన సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సామగ్రిని, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారాను తయారు చేస్తున్న నాగంపేటకు చెందిన అనుసూరి వీర వెంకట సత్యనారాయణను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.